క్లుప్తంగా

డీఎస్సీకి గడువు పెంచండి

ఖమ్మంగాంధీచౌక్: ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన డీఎస్సీ పరీక్ష గడువు పెంచాలని ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు నిరుద్యోగులు వినతిపత్రం అందించారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయం నిరుద్యోగులు వినతిపత్రం అందజేశారు. మే నెలలో నిర్వహించిన టెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించామని, డీఎస్సీకి కేవలం నెల రోజులు మాత్రమే సమయం ఉందని, చదవుకునేందుకు తగిన సమయం కేటాయించాలన్నారు. పరీక్షను మరో 3 నెలల అవకాశం ఇవ్వాలని నిరుద్యోగులు కోరారు.

బండి సంజయ్‌ని కలిసిన నాయకులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్ర హోం సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్ కుమార్‌ను బీజేపీ నాయకులు ఆదివారం కరీంనగర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడవ డివిజన్ కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి దనియాకుల వెంకటనారాయణయాదవ్, వకదాని చిరంజీవి, ఉపేందర్, దొంగల తరుణ్, శ్రీనివాస్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం కేంద్రంగా విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కేంద్రంగా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసే విధంగా చొరవ చూపించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యు ఆధ్వర్యంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డికి ఆయా సంఘాల నేతలు ఆదివారం వేరువేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యులు ఇటికాల రామకృష్ణ, పీడీఎస్‌యు జిల్లా కార్యదర్శి వి.వెంకటేష్‌లు మాట్లాడుతూ... కాంగ్రెస్ తన ఎన్నికల హామీల్లో భాగంగా ఖమ్మం కేంద్రంగా యూనివర్శిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారని, ఆ హామీని నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో యకులు మధు, శివ, రాకేష్, రాజు, ప్రతాప్, రోహిత్, లక్ష్మణ్, ప్రసాద్, శ్రీను తదితరులు ఉన్నారు.

ఏపీ సీఎంను కలిసిన సాధు



చంద్రబాబునాయుడితో సాధు రమేష్‌రెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుని హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ నాయకుడు సాధు రమేష్‌రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కల్కి
వినోద	డెస్పికబుల్ మీ 4
సాయిరాం	కల్కి
ఆదిత్య	14(తెలుగు)
శ్రీనివాస	కల్కి

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	44	బచ్చలికూర	4 / 20
వంకాయ	20	పాలకూర	3 / 20
బెండకాయ	20	చుక్కకూర	3 / 20
పచ్చిమిర్చి	50	తోటకూర	4 / 10
కాకర	70	గోంగూర	4 / 10
బీర	36	మెంతికూర	2 / 20
దొండ	26	కొత్తిమీర	1 / 40
పొట్లకాయ	54	పుదీన	1 / 30
చిక్కుడు	80		
గోరుచిక్కుడు	60		
క్యాబేజీ	40		
క్యాలీఫ్లవర్	40		
ఆలుగడ్డ	40		
చామగడ్డ	40		
క్యారెట్	50		
క్యాప్సికం	70		

-ఖమ్మం వ్యవసాయం

కన్నీటి చదువులు..!



ఖమ్మం నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో సౌకర్యాలు నిల్

- ఏకైక కళాశాల అయినా తప్పని తిప్పలు
- అసహనం వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు
- అపరిశుభ్రంగా టాయిలెట్లు, తరగతి గదులు
- మరమ్మతుకు గురైన ఆర్‌ఓ ప్లాంట్
- కొరవడిన పాలకుల పర్యవేక్షణ

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సమస్యలు ఏకరవు పెడుతున్నాయి. కళాశాలలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థినులకు తిప్పలు తప్పడం లేదు. జిల్లాలోనే ఏకైక ప్రభుత్వ బాలికల కళాశాల కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులతో పాటు సమీప జిల్లాలు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేటలకు చెందిన విద్యార్థులు సైతం ఈ కళాశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి సుమారు 1,000 మంది విద్యార్థులుండగా.. ఇందులో ప్రథమ సంవత్సరంలో ఇప్పటి వరకు 445మంది, ద్వితీయ సంవత్సరంలో 600 మంది విద్యార్థినులు విద్యాభ్యాసం చేస్తున్నారు.

తాగునీటి తంటాలు..

బాలికల కళాశాలలో తాగునీటి సమస్య వేధిస్తోంది. సరైన తాగునీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థినులు వాటర్ బాటిళ్ల పట్టుకొని కొద్దిమంది డిగ్రీ కళాశాలకు వెళ్లి మంచి నీళ్లు తెచ్చుకుంటుండగా.. మరికొద్దిమంది సమీపంలోని దుకాణాలకు వెళ్లి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కళాశాలలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థినులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తరగతి గదులు, టాయిలెట్లు సకాలంలో శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుందని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు.

ఆర్‌ఓ ప్లాంట్‌కు తాళం..



ఆర్‌ఓ ప్లాంట్‌కు తాళం వేసిన దృశ్యం

గతంలో విధులు నిర్వహించిన ఓ అధ్యాపకురాలు సుమారు పదేళ్ల క్రితం తన పదవీ విరమణ సందర్భంగా కళాశాలకు ఒక ఆర్‌ఓ ప్లాంట్‌ను బహూకరించారు. కాగా, ఇటీవల అది మరమ్మతులకు గురికావడంతో తాళం వేశారు. దీంతో నాటి నుంచి విద్యార్థులకు తాగునీటి కోసం కష్టాలు తప్పడం లేదు. ఈనేపథ్యాన ఇటీవల ఓ దాత ఆర్‌ఓ ప్లాంట్ ఇచ్చేందుకు ముందు కొచ్చినట్లు అధ్యాపకులు చెబుతున్నారు.

అరకొర సౌకర్యాలతో అవస్థలు..

జిల్లాలోనే ఏకైక బాలికల కళాశాల కావడంతో విద్యార్థినుల సంఖ్య అధికంగా ఉంటుంది. కానీ సౌకర్యాలు మాత్రం అరకొరగా ఉండడంతో చదువులు సక్రమంగా కొనసాగించలేని దుస్థితి నెలకొంది. ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌ను కలిసి పలు సమస్యలను విన్నవించినట్లు కళాశాల బాధ్యులు చెబుతున్నారు. కాగా, గత కలెక్టర్ రెండు అదనపు తరగతి గదులు మంజూరు చేయగా.. అవి ప్రస్తుతం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. అంతేకాక ఆరు టాయిలెట్స్ సైతం సిద్ధమయ్యాయి. ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు ఆరు తరగతి గదులు అవసరం పడుతున్నాయి.

చర్యలు తీసుకుంటున్నాం..



కళాశాలలో విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆర్‌ఓ ప్లాంట్ మరమ్మతుకు గురైన మాట వాస్తవమే. ఇటీవల ఓ దాత ఆర్‌ఓ ప్లాంట్ ఇచ్చేందుకు ముందుకొచ్చారు. త్వరలో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు అయితే తాగునీటి సమస్య తీరుతుంది.

– బి.అరుణ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్

తాగునీటి సమస్య పరిష్కరించాలి..



కళాశాలలో తాగునీటి సమస్య వల్ల ఇబ్బందులు పడుతున్నాం. సమీపంలో డిగ్రీ కళాశాలకు.. లేదంటే సమీపంలోని దుకాణాల వద్దకు వెళ్లి మంచి నీళ్ల కొనుగోలు చేసి తాగాం. అధికారులు తక్షణమే స్పందించి తాగునీటి సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకోవాలి.

-భూమిక, ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థిని

ఎంపీ రఘురాంరెడ్డి పర్యటన



నేలకొండపల్లి: ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న ఖాదర్



రఘునాథపాలెం: ఎంపీని సన్మానిస్తున్న ఫెలోషిప్ నాయకులు

నేలకొండపల్లి: ఎంపీ రామసహాయం రాఘురాంరెడ్డి ఆదివారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. ఈ మేరకు వారి సమస్యలు పరిష్కరించాలని స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ ఇమామ్ ఖాదర్ ఎంపీని కోరారు. 40 ఏళ్ల నుంచి వెట్టి చాకిరి చేస్తున్నామని, గత ప్రభుత్వం తమకు తీరని అన్యాయం చేసిందన్నారు. కనీస వేతనం రూ.18 వేల ను ఇప్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వేడుకున్నారు. మాజీ సర్పంచ్ చిలకబత్తిని వీరబాబు గ్రామంలో అంతర్గత రహదారి నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.30 లక్షలు ఇప్పించాలని, దివ్యాంగుడు రమేష్ మూడు చక్రాల వాహనం ను అందించాలని కోరారు. రాష్ట్ర నాయకులు నరేష్‌రెడ్డి, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, నాయకులు వెన్నపూసల సీతారాములు, వేగినాటి లక్ష్మీనర్సయ్య, మధార్, భద్రయ్య, గోవిందరావు, వెంకన్న, వజ్జా శ్రీనివాసరావు, కడియాల నరేష్, కొమ్మూరి ప్రసాద్, హనుమంతరావు పాల్గొన్నారు.

బచ్చోడుని మండలకేంద్రంగా ఏర్పాటు చేయాలని వినతి

తిరుమలాయపాలెం: బచ్చోడుని మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కోరుతూ ఆదివారం సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యాలయంలో ఎంపీ రఘురాంరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. 28 పంచాయతీలకు సెంటర్‌గా ఉన్న బచ్చోడు గ్రామాన్ని మండలకేంద్రంగా ఏర్పాటు చేయడంతో బచ్చోడు చుట్టు పక్కల గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు, కమ్మ కోమటి నాగేశ్వరరావు. రేపాకుల శివలింగం, ఝాన్సీ, రాయల రవికుమార్, తిమ్మిడి హనుమంతరావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు. ఆజాద్, రాకేష్, సత్తార్‌మియా లక్ష్మణ్ పాల్గొన్నారు.

క్రిష్టియన్ కమ్యునిటీ హాల్ నిర్మించాలని..

రఘునాథపాలెం: మండలంలోని క్రిష్టియన్ కమ్యునిటీ హాల్ నిర్మాణానికి కృషి చేయాలని ఎంపీ రఘురాంరెడ్డిని ఆదివారం ఖమ్మం జిల్లా మహాసేన పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షులు మందా సంజీవరావు ఆధ్వర్యంలో క్రైస్తవులు కలిసి విన్నవించారు. పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఎంపీని శాలువాతో సన్మానించారు. పాస్టర్ తెల్దర్ పల్లి రమేష్ , కొమ్ము బాబురావు, ఇమ్మానుయేలు, రెడ్డి పాల్గొన్నారు .

వంతెన నిర్మించాలని..

రఘునాథపాలెం మండలంలోని వీవీపాలెంలో ఖమ్మం-వైరా ప్రధాన రహదారిపై పాదచారుల కోసం ఫుట్‌ఓవర్ వంతెన నిర్మించాలంటూ ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డికి గ్రామస్తులు మాజీ సర్పంచ్ కాపా ఆదినారాయణ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ప్రధాన మార్గంలో పాదచారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని వివరించారు.

పండితాపురం సంత వేలం లేనట్లే..



సంత వేలం నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

కామేపల్లి: కొమ్మినేపల్లి(పండితాపురం) పంచాయతీ పరిధి శ్రీ కృష్ణప్రసాద్ పశువుల వారంతపు సంత బహిరంగ వేలం పాట ఈ ఆర్థిక సంవత్సరానికి లేనట్లే. గత మార్చిలో వేలం నిర్వహించగా ప్రభుత్వ మద్దతుధర అధికంగా ఉందంటూ వేలంలో పాల్గొన్న పాటదారులు పాడలేదు తరువాత ఎన్నికల కోడ్ కారణంగా సంత నిర్వాహణ బాధ్యతలను జీపీకి అప్పగించారు. అప్పటి నుంచి సంత నిర్వాహణ జీపీ పరిధిలోనే జరుగుతోంది. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం సంత కౌలు నిర్వహణకు గానూ మూడుసార్లు బహిరంగ వేలం పాట నిర్వహించగా ప్రభుత్వ మద్దతు ధర రాకపోవడంతో వేలాన్ని వాయిదా వేశారు. ఎంపీడీఓ రవీందర్ అధ్యక్షతన సంత ఆవరణలో జూన్ 20, 22న బహిరంగ వేలం నిర్వహించగా రూ.1.30 కోట్లకు మాత్రమే పాటదారులు పాడి ఆగిపోయారు. జూలై 1న నిర్వహించిన బహిరంగ వేలంలో రూ.1,46,10,000 పాటదారులు పాడి ఆగిపోయారు. మద్దతు ధర లభించకపోవడంతో ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఈ మేరకు సోమవారం సంత ఆవరణలో జరగాల్సిన గ్రామసభ అనివార్య కారణాలవల్ల వాయిదా వేశారు. ప్రజల అభిప్రాయం మేరకు హెచ్చుపాటదారుడికి కౌలు బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. మూడుసార్లు నిర్వహించిన వేలంలో హెచ్చుపాటదారుడిగా గ్రామానికి చెందిన భూక్యా వీరన్ననే నిలిచాడు. ఇన్ని సార్లు సంత వేలం వాయిదా పడటం, ఇంకా ఒక కౌలిక్కి రాకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ ప్రతినిధుల బృందానికి స్వాగతం



సమావేశమైన బీఆర్‌ఎస్ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన చింతకాని మండలం, ప్రొద్దుటూరు రైతు ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించేందుకు జిల్లాకు చేరుకున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రతినిధుల బృందానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్ స్వాగతం పలికారు. మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఏనుగుల రాకేష్‌రెడ్డిలు బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయానికి చేరుకొని సమావేశమయారు. అనంతరం మృతి చెందిన రైతు కుటుంబాన్ని పరామర్శించేందుకు ప్రొద్దుటూరు గ్రామంకు వెళ్లారు.

ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి



డీఈఓతో మాట్లాడుతున్న సైదులు

ఖమ్మం సహకారనగర్: సుదీర్ఘ కాలం తర్వాత జరిగిన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు జరగగా వారు యథాస్థానంలో పని చేస్తున్నారని, వారిని తక్షణమే రిలీవ్ చేయాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు డిమాండ్ చేశారు. ఆదివారం డీఈఓను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఉపాధ్యాయులను బదిలీ చేసి వారి స్థానంలో విద్యా వలంటీర్లను నియమించాలన్నారు. అంతేకాకుండా సీనియార్టీ ఉన్నప్పటికీ వెబ్ కౌన్సెలింగ్ విధానంలో జరిగిన సాంకేతిక పొరపాట్లను సవరించి అన్యాయానికి గురైన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గండు యాదగిరి, షేక్ మన్సూర్, నాయకులు మహబూబ్, సురేష్, పాశం శ్రీనివాసరావు, వెంకన్న, సుధాకర్ రెడ్డి, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ జన్మదిన వేడుకలు



తిరుమలాయపాలెంలో..

ఖమ్మం మామిళ్లగూడెం: ఎమ్మార్పీఎస్ 30 ఏళ్ల జెండా పండుగ, వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఆదివారం నగరంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగురవేశారు. నాయకులు బచ్చలకూర వెంకటేశ్వర్లు, అంజయ్య. నరసింహారావు, సాదినేని భవాని, నాగేశ్వరరావు, దశరథ, మోహన్, వీరన్న, వెంకటరత్నం, శ్రీను, పాషా, కిరణ్‌రాజు, చిన్ని శ్రీను, నాగులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలు ఆవిష్కరించారు. జాతీయ కమిటీ ఉపాధ్యక్షుడు వంగూరి ఆనందరావు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, మహేశ్వరరావు, ప్రభాకర్, ఉపేందర్, ఏసు, గోపి, ప్రసాద్, నాగేంద్రబాబు, చిన్న వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: మండలంలోని బీరోలు గ్రామంలో మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. చింతిరాల నాగభూషణం, వికలాంగుల పోరాట సమితి నాయకులు ఎల్లయ్య, అశోక్, మధు, దేవేందర్, నాగేశ్వరరావు, ఉపేందర్, సుజాత, రవి, వెంకన్న, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

ఖమ్మంవన్‌టౌన్: అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైరా మండలం రెబ్బవరం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పగడాల పాపయ్యను ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి పరామర్శించారు.

చెత్త ట్రాక్టర్ పల్టీ



కిందపడిన ట్రాక్టర్ ట్రక్కు

ఖమ్మంమయూరిసెంటర్: వర్షాలతో రామన్నపేట డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయం మార్గంలో డంపింగ్‌యార్డ్‌కు వెళ్లే దారిలో ఆదివారం వ్యర్థాలతో డంపింగ్‌యార్డ్‌కు వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కు పల్టీ కొట్టింది. దీంతో ఆ రోడ్డులో వెళ్లే చెత్త వాహనాలన్ని నిలిచిపోయాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వాహనాలన్నీ నిలిచిపోగా, ట్రక్కును లేపేందుకు తీవ్రంగా శ్రమించారు. చెత్త ట్రాక్టర్ పడిపోయినా, వాహనాలు నిలిచిపోయినా అధికారులు, పాలకులు స్పందించడం లేదని, స్థానికుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని డబుల్‌బెడ్‌రూమ్ నివాసులు ఆందోళన చేశారు. రోజూ ఈ రోడ్డులో చెత్త ట్రాక్టర్లు తిరుగుతుండడంతో రోడ్డు సక్రమంగా లేక మోకాల్లోతు గుంతలు ఏర్పడ్డాయని, వెంటనే రోడ్డును నిర్మించి సమస్యకు పరిష్కారం చూపించాలని వేడుకుంటున్నారు. వారం రోజులుగా స్థానిక నివాసులు బయటకు వెళ్లే పరిస్థితి లేకున్నా పాలకులు వచ్చి తమ సమస్యలను చూడడం లేదని, కనీసం తమను పలకరించేవారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్లాట్ ఫాం 6 పైకి సిటీ బస్సు



ప్లాట్‌ఫాంపై నిలిపిన సిటీ బస్సు

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంమయూరిసెంటర్: ప్రయాణికుల సౌకర్యార్థం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో సిటీబస్‌ను ఆదివారం నుండి 6వ నంబర్ ప్లాట్‌ఫామ్‌పై నిలపనున్నారు. ఆదివారం సాక్షి దినపత్రికలో 'పేరుకే సిటీబస్' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. ప్రయాణికులు బసు దిగే ప్లాట్‌ఫామ్ం పక్కనే ఉన్న 6వ నంబర్ ప్లాట్‌ఫాంపై సిటీ బస్సును నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవాలని నిర్ణయించినట్లు డిపో మేనేజర్ బి.శ్రీనివాస్ తెలిపారు. కొదాడ వెళ్లే ప్రయాణికులను పాత బస్టాండ్‌కు తరలించేందుకు 18వ నంబర్ ప్లాట్‌ఫాంపై సిటీ బస్‌ను ఇప్పటి వరకు నిలిపామని, ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని 6వ ప్లాట్‌ఫాంపై సిటీబస్‌ను నిలుపుతామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం, పెదతండా, మారెమ్మతల్లి రోడ్ కాలనీల్లో విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్లకొమ్మలు తొలగింపు కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మద్దులపల్లి ఏఈ క్రాంతిసింహ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంలో వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

సీత్లా వేడుకలకు సిద్ధం..



గద్దెను సిద్ధం చేస్తున్న గిరిజనులు

రఘునాథపాలెం: బంజారుల ఆరాధ్య దైవం సీత్లా భవాని పండుగకు మండలంలోని గిరిజల గ్రామాల్లోని గద్దెలను ముస్తాబు చేస్తున్నారు. ఈనెల 9న సీత్లా భవాని వేడుకల కోసం గద్దెలకు రంగులు వేసి సిద్ధం చేస్తున్నారు. మండల కేంద్రమైన రఘునాథపాలెంలోని కేటాయించిన స్థలంలో వేడుకలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు గిరిజన సంఘం నాయకులు తెలిపారు.

తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీఐ మాజీ కమిషనర్ శంకర్‌నాయక్‌పై తప్పుడు ఆరోపణలు మానుకోవాలని దళిత, గిరిజన జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఆదివారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. శంకర్ నాయక్ విద్యార్థి దశ నుంచి దశలవారీగా స్వయం కృషితో ఎదిగిన ఎదుగుదల చూసి ఓర్వలేక సంబంధం లేని రైతుల ముసుగులో ఆరోపణలుతోపాటు బ్లాక్ మెయిల్ చేస్తున్నారన్నారు. కారేపల్లి సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో కొంతమంది రాజకీయ నాయకులు స్వలాభం కోసం రైతులను ఉసిగొలిపి శంకర్‌నాయక్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయటం సరైందికాదన్నారు. ఈ సమావేశంలో నాయకులు గుగులోత్ సురేష్ నాయక్, మట్టి గురుమూర్తి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

తిరుమలాయపాలెం: మండలంలోని రాజారం గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన మద్ది చిన్న అప్పారెడ్డి మృతదేహాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కొప్పుల ఉపేందర్ రెడ్డి, రంగాపురం బాలకృష్ణగౌడ్, వేల్పుల మల్లయ్య, సామ వెంకట రెడ్డి, సామా శ్రీనివాస్ రెడ్డి, మందుల ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

ఎస్సై మృతికి కారకులను అరెస్టు చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: అశ్వారావుపేట ఎస్సై శ్రీరాములు శ్రీనివాస్ మృతికి కారకులైన సీఐ, కానిస్టేబుళ్లను తక్షణం అరెస్టు చేసి వారిని విధుల నుంచి తొలగించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరావు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సై కుటుంబాన్ని ఆదుకోవాలని, కోటి రూపాయల నష్టపరిహారం అందించాలని పేర్కొన్నారు.

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సై శ్రీరాములు శ్రీనివాస్ మరణానికి కారకులపై కఠినచర్యలు తీసుకోవాలని భీఆర్ అంబేడ్కర్ ప్రజాసంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి విన్నవించారు. నిందితులను సస్పెండ్ చేయాలని కోరారు.

న్యాయవాదికి బేడీలు వేయడం దారుణం

ఖమ్మం లీగల్: భద్రాచలం పట్టణానికి చెందిన న్యాయవాది కృష్ణ ప్రసాద్ను పోలీస్ స్టేషన్లో తీవ్రంగా హింసించి, బేడీలు వేసి కోర్టుకు తరలించడం దారుణమైన చర్యని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి న్యాయవాది గొల్లపూడి రామారావు అన్నారు. ఆదివారం ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. సంఘటన పై విచారణ జరిపించి చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

'భగీరథ'తో మురుగుమయం..!



మిషన్‌భగీరథ నీరు, వ్యర్థాలతో మురుగు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కొత్త బస్టాండ్ పక్కన, భూగర్భజల శాఖ కార్యాలయానికి ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలోకి మిషన్‌భగీరథ ట్యాంకు నుండి లీకైన నీరు చేరడంతో మురుగుమయంగా మారింది. ఖాళీ స్థలం నిండి మురుగుగా మారిన నీరంతా రోడ్డుపైన ప్రవహిస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలే ఈ కాలంలో నగరంలో ఇలా మురుగు పేరుకపోయి ఉండడం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేఎంసీ అధికారులు ఈ సమస్యపై ఎందుకు దృష్టి సారించడం లేదని స్థానికులు, ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.